జనం కోసం - మన అక్షరం

# అక్షర వెలుగు

TELTEL02057

www.aksharavelugu.com

తెలుగు దిన పత్రిక



E-Paper పాఠకులు చేరుకోండి

80 మిలియన్ వ్యూవర్‌షిప్ కలిగిన డిజిటల్ న్యూస్‌పేపర్ సైట్

ఆది వారం 13.03.22 | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : పృద్విరాజు. జి | సంపుటి - 01, సంచిక-23 | పేజీలు - 4 | వెల రూ. 5

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# అసెంబ్లీలో కాంగ్రెస్, టీఆర్ఎస్ మధ్య వాడీవేడి చర్చ

- విద్యారంగానికి కేటాయింపులపై వాదోపవాదాలు
- ప్రభుత్వం చేసే మంచి పనులను కూడా ఒప్పుకోరా అన్న కెటిఆర్
- గత 60 ఏళ్లతో పోలిసత్ఏ ఎన్నో రెట్ల నిధులుపెంచామని వెల్లడి
- భట్టి విక్రమార్క విమర్శలపై మండిపడ్డ మంత్రి
- నిధులు డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డ మల్లు భట్టి



**హైదరాబాద్, మార్చి 12 (అక్షర వెలుగు):** శాసన సభ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో కాంగ్రెస్, టీఆర్ఎస్ మధ్య వాడీవేడి చర్చ జరిగింది. అసెంబ్లీలో విద్యారంగ కేటాయింపులపై మంత్రి కెటిఆర్, సీఎల్పీ నేత భట్టి విక్రమార్కల మధ్య చిన్నపాటి వాదం జరిగింది. విద్యారంగానికి కేటాయింపులు తక్కువగా ఉన్నాయని భట్టి చేసిన వ్యాఖ్యలపై మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. భట్టి విమర్శలు తప్పు.. మంచిని గుర్తించడం లేదని తప్పుబట్టారు. 60 ఏళ్లలో కాంగ్రెస్ పాలనలో ఎన్ని రెసిడెన్షియల్ స్కూల్స్ తీసుకొచ్చారని ప్రశ్నించారు. తెలంగాణ వచ్చాక 975 రెసిడెన్షియల్ స్కూళ్లను తీసుకొచ్చామని తెలిపారు. విద్యారంగానికి అధిక ప్రాధాన్యతిస్తున్నామని కేటీఆర్ చెప్పారు. అలాగే మనవూరు మనబడికి నిధులు కేటాయించామని అన్నారు. చేస్తున్న మంచి పనులను కూడా ఒప్పుకోకపోతే ఎలా అన్నారు. గత పాలనతో పోలిస్తే తెలంగాణ వచ్చాక విద్యారంగానికి కేటాయింపులు పెంచామని అన్నారు. అంతకుముందు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మాట్లాడుతూ మన ఊరు మన బడి కార్యక్రమానికి నిధులు కేటాయించాలని, అంతేకాకుండా స్వీపర్లకు జీతాలు పెంచి వారిని పర్మినెంట్ చేయాలంటూ వ్యాఖ్యానించారు. దీనిపై మంత్రి కేటీఆర్ స్పందిస్తూ.. భట్టి అంటే గౌరవం ఉందని.. కానీ ఆయన మాటలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. 60 ఏండ్లు రాజ్యం ఏలింది మీరు..మీ పార్టీనే కదా, భట్టి ధోరణి డొల్లగా ఉందన్నారు. మన ఊరు..మన బడి కి నిధులు ఇచ్చింది తెలియదా..? అని ఆయన వ్యాఖ్యానించారు. మీ హయాంలో కంటే 10 రేట్ల రెసిడెన్షియల్ స్కూల్ పెంచామని, భట్టి విమర్శ కోసం విమర్శలు చేస్తున్నారని, సీఎం నిన్న కాక మొన్ననే ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ చెప్పారన్నారు. ప్రకటన రాగానే అయిపోతాదా..? కొంత టైం పట్టదా..? అని కేటీఆర్ (మిగతా 2వ పేజీలో)

## ఆర్బిటేషన్ మీడియేషన్ సెంటర్‌కు సిజె శంకుస్థాపన



**హైదరాబాద్, మార్చి 12 (అక్షర వెలుగు):** హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఆర్బిటేషన్ మీడియేషన్ సెంటర్ నూతన భవన నిర్మాణాలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ శంకుస్థాపన చేశారు. మాదాపూర్‌లోని ఐకియా సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ హిమాకోహ్లి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సతీశ్‌చంర్‌దశర్మ, ఐఏఎంసీ ట్రస్టీలైన స్రుపీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు, సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ ఆర్వీ రవీంర్‌దన్, మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రంలో 16నుంచి ఒంటిపూట బడులు



**హైదరాబాద్, మార్చి 12 (అక్షర వెలుగు):** ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 23 తేదీ వరకు రాష్ట్రంలో ఒక పూట బడులను నిర్వహించాలని విద్యా శాఖ తెలిపింది. ఇందుకు గాను స్కూలు వేళలను మార్పు చేసింది. ఉదయం గం. 7:45 నుంచి మధ్యాహ్నం గం. 12:00 వరకు తరగతులు నిర్వహించనున్నారు. ఒంటిపూటకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులను మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు.

## పార్టీ ఆదేశిస్తే పోటీ చేస్తా: తుమ్మల



**ఖమ్మం, మార్చి 12 (అక్షర వెలుగు):** టీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్‌కు రెబల్‌గా మారాల్సిన అవసరం లేదన్నారు. వ్యక్తిగత లబ్ది కన్నా పార్టీ నిర్ణయమే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రజల అంచనాలకు తగ్గట్టుగా ప్రజాప్రతినిధుల నడవడిక ఉండాలన్నారు. సీఎం కేసీఆర్ పాలనాదక్షతపై ప్రజలకు అపార నమ్మకం ఉందన్నారు. పార్టీ నిర్ణయం, ప్రజాభిప్రాయం మేరకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను తుమ్మల నాగేశ్వర్ రావు తీవ్రంగా ఖండించారు.

## పాఠశాల ప్రార్థనలో పాల్గొన్న స్పీకర్



**కామారెడ్డి, మార్చి 12 (అక్షర వెలుగు):** కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని నస్రుల్లాబాద్ మండలం నెమలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పాఠశాల ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులతో పాటు స్పీకర్ పోచారం కూడా వరుస క్రమంలో నిలబడి ప్రార్థన చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రార్థన ముగిసిన అనంతరం 60 లక్షలతో నిర్మించిన తొమ్మిది అదనపు తరగతి గదులను పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు.

## ఆపరేషన్ గంగతో నేపాలు చేరుకున్న పౌరులు



### ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపిన నేపాల్ ప్రధాని

**న్యూఢిల్లీ, మార్చి 12 (అక్షర వెలుగు):** భారత ప్రధాని నరేంద్ర మోడీకి నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవుబా కృతజ్ఞతలు తెలిపారు. ఉక్రెయిన్ నుంచి నలుగురు నేపాలీ జాతీయుల్ని క్షేమంగా తమ దేశానికి చేర్చినందుకు గాను మోడీకి రునపడి ఉన్నామని చెప్పారు. నలుగురు నేపాలీ జాతీయులు ఉక్రెయిన్ నుంచి భారత్ మీదుగా నేపాల్ చేరుకున్నారు. ఆపరేషన్ గంగా ద్వారా నేపాలీ జాతీయులను స్వదేశానికి రప్పించడంలో సహాయం చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి, భారత ప్రభుత్వానికి నేపాల్ ప్రధాని ధన్యవాదాలు తెలిపారు.. మరోవైపు ఇప్పటికే ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయులందర్నీ స్వదేశానికి తరలించారు. ఆపరేషన్ గంగ పేరుతో కార్యక్రమాన్ని చేపట్టి (మిగతా 2వ పేజీలో)

## కోమటిరెడ్డి, జీవన్ రెడ్డిల మధ్య సంవాదం



కెసిఆర్‌ను అంటే ఊరుకునేది లేదన్న జీవన్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 12 (అక్షర వెలుగు):** ఆర్మూర్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిల మధ్య ఈ ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. సీఎల్పీ కార్యాలయంలో శనివారం వీరిద్దరూ ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు మాట్లాడుకున్నారు. 'జీవన్.. మా గురించి చాలా మాట్లాడుతున్నావు ఏంటి..?' అని ఎమ్మెల్యే రాజగోపాల్ ప్రశ్నించారు. దీనికి ఎమ్మెల్యే జీవన్ రెడ్డి స్పందిస్తూ.. 'అవును మా బాస్‌ను ఒక్క మాట అంటే వంద మాటలంటాం.. బరాబర్‌గా అంటాం' అని అన్నారు. నేను సీఎం కేసీఆర్‌ను ఏం అనలేదు.. మీడియా వాళ్లు కేసీఆర్‌కు హెల్త్ బాగోలేదని చెబితే.. 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు చూసి ఏమో అని మాత్రమే అన్నానని రాజగోపాల్ రెడ్డి జవాబిచ్చారు. అసలు సీఎం కేసీఆర్ హాస్పిటల్‌కు వెళ్లిన విషయం తనకు తెలియదని, తనకు పైనుంచి ఆదేశాలు ఉన్నందునే నిన్ను తిట్టాను అని జీవన్ రెడ్డి తెలిపారు. మేము తెలంగాణ తెస్తే మమ్మల్నే తిడుతున్నారని రాజగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో మంత్రి పదవి త్యాగం చేసినందుకు తమ కుటుంబంపై తమకు గౌరవం ఉందని జీవన్ రెడ్డి తెలిపారు. సోనియా గాంధీని ఎప్పుడూ విమర్శించ మని, ఎందుకంటే ఆమె తెలంగాణ ఇచ్చిన దేవత.. తాము కేవలం రాహుల్ గాంధీ, కాంగ్రెస్‌ను తిడతామన్నామని పేర్కొన్నారు. అయితే తెలంగాణలో కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసినా అధికారంలోకి రాదని, మరో 20 ఏళ్లు టీఆర్ఎస్ అధికారంలో ఉంటుందని జీవన్ రెడ్డి తెలిపారు

## అభయహస్తం మహిళలకు శుభవార్త

### డిపాజిట్ డబ్బులు వాపస్ చేయనున్న ప్రభుత్వం

**హైదరాబాద్, మార్చి 12 (అక్షర వెలుగు):** రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు పొదుపు చేసుకున్న అభయ హస్తం నిధులను ఆ మహిళలకు తిరిగి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, ఆయాశాఖల కార్యదర్శులు, ఇతర అధికారు లతో సమీక్ష నిర్వహి ంచారు. రాష్ట్రవ్యాప్తంగా 21 లక్షల మంది డ్వాక్రా సంఘాల మహి ళలు రూ.545 కోట్లు పొదుపు చేసుకున్నారు. అప్పట్లో అభయ హస్తం కింద రూ.500 కంట్రి బ్యూటరీ పెన్షన్ కోసం పొదుపు చేస్తూ వచ్చారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం వచ్చాక.. ఆసరా పథకం కింద మొదట్లో రూ. వెయ్యి, ఇప్పుడు రూ. 2016 మొత్తాన్ని పెన్షన్‌గా ఇస్తున్న విషయం తెలిసిందే. అప్పటి కంటే ఇప్పుడు అధిక మొత్తంలో పెన్షన్ వస్తున్నది. మహిళలుసైతం అభయహస్తం డబ్బులు తమవి తమకు కావాలని అడుగుతున్నారు. పొదుపు మహిళల కోరిక మేరకు ఆ నిధులను వారికి తిరిగి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నిధులు సంబంధిత పేదరిక నిర్మూలన సంస్థ వద్దే ఉన్నాయి. అయితే, ఆ నిధులు మొత్తాన్ని వారికి తిరిగి ఇవ్వనున్నారు. రెండు మూడు రోజుల్లోనే ఆ నిధిని ఆయా మహిళల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని తీసుకోవాలని మంత్రులు ఆదేశించారు.

### హైకోర్డు ఆదేశాలు దిగివచ్చిన ప్రభుత్వం

- అమ్ ఆద్మీ పార్టీ నేత ఇందిరా శోభన్ పోరాట ఫలితంగా మహిళలకు లబ్ధి



అభయహస్తం పథకాన్ని ప్రభుత్వం రద్దు చేయడం వల్ల 20 లక్షల మంది నష్ట పోవడంతో ఆప్ నేత ఇందిరా శోభన్ ఈ అంశం పై హైకోర్టులో పిల్ దాఖలు చేసిన సంగతి విదితమే. ఈ విషయంపై స్పందించిన హైకోర్టు ఆరు వారాల్లో ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని ఆదేశించగా శనివారం ప్రభుత్వ యంత్రాంగం సమిక్షా సమావేశం నిర్వహించింది.

'అక్షర వెలుగు' కథనానికి ప్రభుత్వ స్పందన




## శ్రీమహావిష్ణు అలంకారంలో నృసింహుడు



**యాదాద్రి, మార్చి 12 (అక్షర వెలుగు):** యాదాద్రి శ్రీలక్ష్మి నరసింహస్వామి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగ రంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు స్వామివారు శ్రీ మహావిష్ణు అలంకారం లో గరుడ వాహనం పై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. విష్ణుమూర్తి అలంకారంలో గరుడ వాహనంపై బాలాలయ తిరువీధుల్లో స్వామివారు ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. వజ్ర వైఢూర్యాల ధరించిన స్వామివారు ఆలయ తిరువీధులో ఊరేగుతూ దగదగ మెరిసిపోయారు. రాత్రి 7 గంటలకు (మిగతా 2వ పేజీలో)

## తెలంగాణకు వైఎస్ ఒరగబెట్టిందేమీ లేదు

- ఆయన పక్కా తెలంగాణ వ్యతిరేకి
- వైఎస్ షర్మిల విమర్శల్లో అర్థం లేదు: బండా




**నల్లగొండ, మార్చి 12 (అక్షర వెలుగు):** సమైక్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైఎస్ రాజశేఖరరెడ్డి తెలంగాణకు ఒరగబెట్టింది ఏమీ లేదని, ఆయన పక్కా తెలంగాణ విరోధి అని నల్లగొండ జిల్లా పరిషత్ చైర్మన్ బండా(మిగతా 2వ పేజీలో)

## ప్రముఖ గేయ రచయిత కందికొండ మృతి

**అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుదిశ్వాస**

**సినీ, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి**



**హైదరాబాద్, మార్చి 12 (అక్షర వెలుగు):** ప్రముఖ గేయ రచయిత కందికొండ(49) అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందారు. గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. అయితే ఆసుపత్రి ఖర్చులు భారీగా చెల్లించాల్సి వస్తుండటంతో ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్(మిగతా 2వ పేజీలో)

## గురుకుల విద్యార్థుల్లో భోజన భయం

### వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలతో ఆందోళన

**ఆదిలాబాద్, మార్చి 12 (అక్షర వెలుగు):** జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాల్లో భోజనం అంటే విద్యార్థులు భయంతో వణికిపోతున్నారు. వరుసగా స్కూళ్లు, హాస్టళ్లల్లో ఫుడ్ పాయిజన్ అవుతుండడంతో ఆందోళన కలిగిస్తోంది. 4, 5 రోజులుగా ఏదో ఒక చోట ఆహారం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. తాజాగా ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో... 40 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయింది. వారిని ఆదిలాబాద్ రిమ్స్ కు తరలించి ట్రీట్ మెంట్ అందిస్తున్నారు. 3 రోజుల క్రితమే ఆదిలాబాద్ లో వరుసగా రెండు రోజులు ఫుడ్ పాయిజన్ అయింది. హాస్టల్లో భోజనం చేసిన 60 మందికి పైగా విద్యార్థులకు వాంతులు అయ్యాయి. వారం క్రితం(మిగతా 2వ పేజీలో)

జనం కోసం - మన అక్షరం
అక్షర వెలుగు
www.aksharavelugu.com
తెలుగు దిన పత్రిక

## ప్రముఖ గేయ రచయిత కందికొండ మృతి

(మొదటి పేజీ తరువాయి..) కేటీఆర్ ఇటీవలే కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ సాయం చేశారు. కందికొండ స్వస్థలం వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని నాగుర్లపల్లి గ్రామం. ఆయన చదువుకునే రోజుల నుంచే పాటలు రాయడం నేర్చుకున్నారు. ఇంటర్ చదివేటప్పుడు చక్రితో పరిచయం ఏర్పడింది. మొదట్లో జానపద గీతాలు రాసిన కందికొండ సినీ సంగీత దర్శకుడైన చక్రి సాన్నిహిత్యంతో సినిమా సాహిత్యం వైపు మొగ్గు చూపారు. తొలిసారిగా చక్రి సంగీత దర్శకత్వం వహించిన 'ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం' చిత్రంలో 'మళ్లి కూయవే గువ్వా' పాట రచనతో సినీ సాహిత్యంలో అడుగుపెట్టారు. దర్శకుడు పూరీ జగన్నాథ్ వరుస అవకాశాలతో పాటలు రాసి గేయరచయితగా నిలదొక్కుకున్నారు. కందికొండ సినీరంగంలో అడుగుపెట్టిన నాటి నుంచి పన్నెండేళ్ళ సినీ ప్రస్థానంలో వేయికి పైగా పాటలు రాశారు. తెలంగాణ నేపథ్యంలో ఎన్నో జానపద గీతాలు కూడా రచించారు. ఆయన బతుకమ్మ నేపథ్యంలో రాసిన పాటలు ప్రతి గ్రామంలోనూ మార్మోగాయి. ఆయన పాటలే కాదు కవిత్వం రాయడంలోనూ దిట్ట. తెలంగాణ యాసలో మనసుకు హత్తుకునేలా కవిత్వం రాయటం ఆయన ప్రత్యేకత. మట్టిమనుషుల వెతలను, పల్లె బతుకు చిత్రాన్ని కథలుగా రచించి ఆయన కథకుడిగా కూడా విశేష ఆదరణ పొందారు. ఆయన మృతికి సినీ,రాజకీయరంగ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని ప్రకటించారు.

## గురకుల విద్యార్థుల్లో భోజన భయం

(మొదటి పేజీ తరువాయి..) గోట్కూరి ప్రభుత్వ పాఠశాలలో 28 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయింది. ఇక బాసర ట్రిబుల్ ఐటీలో రోజూ ఇదే పరిస్థితి ఉందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. పురుగుల అన్నం, సాంబార్లో కప్పలు వచ్చాయని చెప్తున్నారు విద్యార్థులు. స్కూళ్లు, హాస్టల్స్ లో ఉన్న విద్యార్థులకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు పేరంట్స్.

(మిగతా 2వ పేజీలో)

## శ్రీ మహావిష్ణు అలంకారంలో నృసింహుడు

(మొదటి పేజీ తరువాయి..) బాలాలయంలో బంగారు రథంపై రథోత్సవం నిర్వహించనున్నారు. అయితే ఈ నెల 28 నుంచి ప్రధానాలయంలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ నేపథ్యంలో స్వామివారికి స్వర్ణరథంపై బాలాలయంలో ఊరేగింపు నిర్వహించడం ఇదే మొదటి, చివరిసారి కానుంది.

## కోమటిరెడ్డి, జీవన్ రెడ్డిల మధ్య సంవాదం

(మొదటి పేజీ తరువాయి..) అనంతరం ఇరువురు నేతలు ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. మరోవైపు సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై .జీవన్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద శనివారం ఆయన మాట్లాడుతూ.. జనరల్ హెల్త్ చెకప్ కోసం సీఎం కేసీఆర్ ఆస్పత్రికి వెళ్లారని అన్నారు. అయిదు రాష్ట్రాల్లో కాంగ్రెస్, బీజేపీలు గెలిస్తే తమకేంటని.. ఓడితే తమకేంటన్నారు. ఆ రెండు పార్టీలు కట్టగట్టుకొని ఎక్కడైనా దూకి చస్తే తమకేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌ది మామూలు గుండె కాదని, కోట్లాది మంది అభిమానం ప్రజల అభిమానం పొందిన గుండెని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలను మట్టి కరిపించిన ఉక్కు గుండె అని చెప్పుకొచ్చారు.

## ఆపరేషన్ గంగతో నేపాలు చేరుకున్న పౌరులు

(మొదటి పేజీ తరువాయి..) స్పెషల్ ద్వారా అక్కడున్న మనవారిని భారత్‌కు రప్పించారు. అయితే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ గంగ' కార్యక్రమాన్ని సుప్రీం కోర్టు ప్రశంసించింది. ఉక్రెయిన్ లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం గొప్ప చర్యలు చేపట్టిందని సంతృప్తిని వ్యక్తం చేసింది అత్యున్నత న్యాయస్థానం. భారతీయుల తరలింపు, సాయం కోసం హెల్ప్ డెస్కు ఏర్పాటు చేయాలన్న పిటిషన్ పై చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం స్పందించింది. ఉక్రెయిన్ లో చిక్కుకున్న వారి కుటుంబ సభ్యులు బాధపై ఆందోళన వ్యక్తం చేసింది ఉన్నత న్యాయస్థానం.

## తెలంగాణకు వైఎస్ ఒరగబెట్టిందేమీ లేదు

(మొదటి పేజీ తరువాయి..) నరేందర్‌రెడ్డి అన్నారు. ఆయన కుమార్తె వైఎస్ షర్మిల నల్లగొండ జిల్లాలో పాదయాత్ర చేస్తూ అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ రావొద్దని కోరుకున్న వారిలో మొదటి స్థానంలో వైఎస్, ఆయన కుటుంబం ఉండేదని శనివారం నల్లగొండలో మీడియా సమావేశంలో దుయ్యబట్టారు. రాజశేఖర్ రెడ్డి ఏదో గొప్ప అభివృద్ధి చేశాడని, రాజన్న రాజ్యం లోనే అభివృద్ధి జరిగిందంటూ వైఎస్ షర్మిల ఊకదంపు ఉపన్యాసాలతో ఊదరగొట్టడం తగదని బండా నరేందర్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ అభివృద్ధిని పణంగా పెట్టిన వైఎస్సార్.. రాయలసీమకు నిధులు దోచుకుపోయాడని ఆరోపించారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో దేశానికి ఆదర్శవంతంగా పాలన సాగుతున్నదన్నారు. కేసీఆర్ అభివృద్ధి, ప్రజలకు అందించే సంక్షేమ ఫలాలను యావత్ భారతదేశం పొగుడుతున్నదని గుర్తుచేశారు. 95 శాతం ఉద్యోగాలు స్థానికులకు రావాలనే ఉద్దేశంతోనే ఇన్నాళ్లూ ముఖ్యమంత్రి ఉద్యోగ నియామకాలపై కసరత్తు చేసారని, ఇది తెలియని వైఎస్ షర్మిల అడ్డగోలుగా మాట్లాడటాన్ని బట్టి ఆమెకు విషయ పరిజ్ఞానం లేదని తెలుస్తున్నదని విమర్శించారు. అసలు షర్మిలకు తెలంగాణకు ఏమిటి సంబంధం? ఇలాంటి వ్యక్తులను ఈ గడ్డపై ఇంకా తిరగనివ్వడమే ఇక్కడి ప్రజలు చేస్తున్న తప్పా..? అని ప్రశ్నించారు. ఇకనైనా నోరు అదుపులో పెట్టుకుంటే బాగుంటుంది అని ఆయన హితవుపలికారు. మీడియా సమావేశంలో టీఆరెస్ నేతలు రేగట్టే మల్లికార్జున్ రెడ్డి, అలంకుంట్ల మోహన్ కూడా పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు

### పంపిణీ చేసిన టిఆర్ఎస్ మండల నాయకులు



**ములుగు, మార్చి 12(అక్షర వెలుగు):** ఏటూరునాగారం మండల కేంద్రంలో 9వ.వార్డు కు చెందిన మంతెన భరత్ తండ్రి పేరు శంకర్ గారికి ముఖ్యమంత్రి సహాయనిధి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి50000 యాభైవేల రూపాయలను ములుగు జిల్లా జడ్పీ చైర్మన్ ములుగు జిల్లా తెరాస అధ్యక్షులు గౌరవ శ్రీ కుసుమ జగదీశ్వర్ గారి ఆదేశ అనుసారంగా ఏటూరునాగారం తెరాస మండల అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్ గారు మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ సర్దార్ పాషా పట్టణ అధ్యక్షులు ఎండి ఖాజా పాషా గారి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు సీనియర్ నాయకులు మహిళాలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు ఈ సందర్భంగా సునీల్ కుమార్ గారు మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా ఆర్థిక సహాయమును అందిస్తున్న గొప్ప నాయకుడని బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మన రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవ కెసిఆర్ గారని సునీల్ కుమార్ గారూ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యులు వలీయబి సలీం గారు తెరాస సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి గారు ఎంపీటీసీ.కుమ్మరి స్వప్న చంద్రబాబు సీనియర్ నాయకులు సప్పిడి రాంనర్సయ్య మహిళా అధ్యక్షురాలు ఈసం స్వరూప మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ సఫియ సోషల్ మీడియా ఇంచార్జి జాడి బోజారావు అనుబంధ సంఘాల మండల అధ్యక్షులు వావిలాల రాంబాబు పర్వతాల రమేష్ గారా ఆనంద్ చందా లక్ష్మీనారాయణ గారు పార్టీ ముఖ్య నాయకులు సంతోష్ కొండాయి చిన్ని వావిలాల ముత్తయ్య అల్లీ శ్రీనివాస్ అటిక నాగేశ్వరరావు కాళ్ళ రామకృష్ణ.తాళ్ల పెల్లి మోహన్.పాలకుర్తి విజయ్.అభిద్.వార్డ్ సభ్యులు నాగ సాగర్ చిప్ప నాగరాజు ప్రమోద్ బూర వెంకన్న చెన్న రాంబాబు మంతెన ముత్తయ్య చంద్రమ్మ మంతెన శంకర్ పెద్దబోయిన శ్రీనివాస్ మంతెన బిక్షపతి సుధాకర్ ఎర్రకట్ల కృష్ణ తెరాస మండల మహిళ నాయకులు ఎండి మహబూబ్ బీ సంఘం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## పెరిగిన సన్నరకం ధాన్యం సాగు విస్తీర్ణం

- ప్రభుత్వ హెచ్చరికల నేపథ్యంలో ఆరుతడి పంటలు
- వ్యాపారులు, మిల్లర్లతో వరి రైతుల ఒప్పందాలు

నిజామాబాద్,మార్చి12(ఆర్ఎన్ఎ): జిల్లాలో యాసంగి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. యాసంగిలో వరి వేయవద్దని ప్రభుత్వం ప్రకటించినా రైతులు సాగులో నిమగ్నమయ్యారు. రైతులు ఆరుతడి పంటలను సైతం ఎక్కువ మొత్తంలో సాగు చేశారు. జిల్లాలో పంటల సాగు వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు వ్యవసాయ అధికారులు నెల రోజులుగా క్లస్టర్‌ల వారీగా క్రాప్ బుకింగ్‌ను చేస్తున్నారు. ప్రతి గ్రామ పరిధిలోకి వ్యవసాయశాఖ అధికారులు వెళ్లి క్రాప్ బుకింగ్ యాప్ ద్వారా సర్వే నెంబర్‌లను నమోదు చేస్తున్నారు. సర్వే మ్యాప్‌లో రైతులు వేసిన పంటల వాస్తవ పరిస్థితిని గుర్తించి విస్తీర్ణాన్ని నమోదు చేస్తున్నారు. ప్రతీ రైతు ఏయే పంటలు వేశారో వివరాలను ఎంట్రీ చేస్తున్నారు. వరితో పాటు ఏ పంటలు ఎక్కువగా వేశారో వాటిని నమోదు చేస్తున్నారు. పంటల మార్పిడికి రైతులు మొగ్గుచూపారా లేదా అనే అంశాలను ఈ క్రాప్ బుకింగ్ ద్వారా వివరాలను తీసుకున్నారు. మొత్తం జిల్లాలో సాగైన పంటల విస్తీర్ణం, వాటి వివరాలను వెంటనే ట్యాబ్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో గత సంవత్సరంతో పోలిస్తే 30వేల ఎకరాల్లో వరి సాగు తగ్గింది. ప్రస్తుతం మూడున్నర లక్షల ఎకరాల్లో సాగు కావడం వల్ల 8లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి రానుంది. జిల్లాలో వరి ఎక్కువ సాగు చేయడం వల్ల రైతులు ధాన్యం అమ్ముకునేందుకు తిప్పలు పడే పరిస్థితులు ఏర్పడనున్నాయి. జిల్లాలో వర్ని, మోస్రా, చందూర్, కోటగిరి, రుద్రూర్ మండలాల పరిధిలో వరి సాగును ముందుగా చేశారు. ఈ నెలాఖరు నుంచి వరి కోతలను మొదలుపెట్టనున్నారు. ఈ మండలాల పరిధిలోని రైతులు ఇప్పటికే సూర్యాపేట, కర్నూల్, బల్లారి వ్యాపారులతో ఒప్పందాలను చేసుకుంటున్నారు. వరి కోతలు మొదలుపెట్టగానే వారికే ధాన్యాన్ని అమ్మేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో సన్న రకాలు సాగుచేసిన రైతులతో రైస్ మిల్లర్‌లు కూడా ఒప్పందాలు చేసుకుంటున్నారు. తమ మిల్లులకు దగ్గరగా ఉన్న గ్రామాల్లో రైతులు వేసిన పంటలను కొనుగోలు చేసేందుకు ఒప్పందాలు చేసుకుంటున్నారు. జిల్లాలో పంటల సాగు మొదట తగ్గినా.. రైతులు ఆరుతడి పంటలను వేయడంతో సాగు పెరిగిందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. క్రాప్ బుకింగ్ ద్వారా పంటల వాస్తవ పరిస్థితిని నమోదు చేశామని ఆయన తెలిపారు. వరి కొంతమేర తగ్గిన ఎర్రజొన్న, సజ్జ, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలు పెరిగాయన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే కొంతమేర పంటలు తగ్గినా ఎక్కువ మొత్తంలోనే సాగు కొనసాగించారు. జిల్లా వ్యాప్తంగా గడిచిన నెల రోజులుగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేస్తున్న క్రాప్ బుకింగ్ వల్ల పంటల సాగు వాస్తవ పరిస్థితి బయటపడింది. ధాన్యం కొనుగోలు చేయబోమని ప్రభుత్వం ప్రకటించినందున రైతులు ఆరుతడి పంటలకు మొగ్గుచూపారు. గత సంవత్సరంకంటే లక్ష ఎకరాల వరకు వరి తగ్గుతుందని వ్యవసాయశాఖతో పాటు ప్రభుత్వం అంచనా వేసినా.. పంటల సాగు తగ్గలేదు. జిల్లాలో శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల ఆయకట్టుతో పాటు గుత్ప, అలీసాగర్, లక్ష్మి కాల్వల కింద వరి ఎక్కువగా సాగు చేశారు. వీటితో పాటు రామడుగు రిజర్వాయర్ కింద వరి వేశారు. జిల్లాలోని ప్రాజెక్టుల ఆయకట్టులేని ప్రాంతాల్లో బోర్ల కింద వరిసాగు కొనసాగించారు. ప్రభుత్వం కొనుగోలు చేయకున్నా ధాన్యాన్ని అమ్ముకునేవిధంగా ఎక్కువ మొత్తంలో సన్న రకాలను వేశారు. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం యాసంగిలో సన్న రకాలను 55 శాతానికి పైగా రైతులు వేశారు. దొడ్డు రకాలను తగ్గించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకున్న వ్యాపారులు, రైస్ మిల్లర్‌లకు అమ్ముకునేవిధంగా ఏర్పాట్లను చేసుకున్నారు.

## ఉక్రెయిన్ యుద్ధానికి కానరాని పరిష్కారం

- చేష్టలుడిగిన ప్రపంచ దేశాల నేతలు
- యుద్ధాన్ని నివారించే చర్యల్లో ఐరాస విఫలం



**మాస్కో, మార్చి 12 (అక్షర వెలుగు):** ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మొదలై పక్షం రోజులైనా ముగింపు ఎప్పుడో తెలియడం లేదు. ప్రపంచ దేశాలు కూడా దీనికి సంబంధించి పెద్దగా స్పందించడం లేదు. ఈ క్రమంలో అటు ఉక్రెయిన్ తీవ్రంగా నష్టపోతోంది. ఈ క్రమంలో దానిపై ఆధారపడ్డ దేశాలు కూడా నష్టపోతున్నాయి. పుతిన్ బలగాలను ఉక్రెయిన్ సైన్యం, పౌరులు కలిసికట్టుగా ఎదిరిస్తున్నా. లాభం లేకుండా పోతున్నది. ఉక్రెయిన్ నష్టం మూటగ్టుకుంటున్నా ముగింపునకు చర్యలు తీసుకోవడం లేదు. ఉక్రెయిన దేశంలోని ఒక్కో నగరాన్ని, పట్టణాన్ని వ్యూహాత్మక ప్రాంతాలను రష్యా తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నది,. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీకి ఇంకా అమెరికా, నాటోపై ఆశ చావలేదు. ఓ వైపు ఉక్రెయిన్‌లో యుద్ధ బీభత్సం సృష్టిస్తూనే రష్యా మరోపక్క చర్చలు జపం చేస్తోంది. రష్యా చర్యను ఇప్పటికే మెజార్టీ దేశాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఐక్యరాజ్య సమితి వేదికగా దాడిని ఖండించాయి కూడా. దీనిపై సమితి తీర్మానం కూడా చేసింది. పశ్చిమ దేశాలు అత్యంత కఠినమైన ఆర్థిక ఆంక్షలతో పుతిన్‌ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఆంక్షలతో రష్యా ఇప్పుడు ఆర్థికంగా, రాజకీయంగా, న్యాయపరంగానూ ప్రపంచంలో ఒంటరైనా తన యుద్ధాన్ని ముగించడం లేదు. మరోవైపు ఈ యుద్ధం రష్యాను బాగా కుంగదీస్తుంది. ఆంక్షలతో ఆ దేశం తీవ్రంగా దెబ్బతింటుంది. పుతిన్ పట్ల ప్రజా వ్యతిరేకత పెరుగుతుంది. చైనా జోక్యం చేసుకుంటుంది. రాజీ చేసుకోవాలని రష్యాపై ఒత్తిడి తెస్తుంది. యుద్ధం ఇంకా ముదిరితే రష్యా చమురును, గ్యాస్‌ను తాను కొనబోనని బెదిరిస్తుంది. దీంతో పుతిన్ ఇందులో నుంచి బయటపడే మార్గం కోసం వెతుకుతాడు. జెలెన్ స్కీని స్థానంలో తన తోలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించటానికి ముందు రష్యా దళాలు నెమ్మదిగా మొత్తం ఉక్రెయిన్‌పై నియంత్రణ సాధిస్తుంది. ఆ సమయానికి ఉక్రెయిన్ ప్రజలు యుద్ధంతో విసిగి వేసారి పోతారు. అప్పుడు వారు రాజీ మార్గాన్ని ఎంచుకోవచ్చు. అప్పుడు వివిధ దేశాలతో రష్యా సంబంధాలు మారుతాయి. భద్రతకు సంబంధించి యూరప్ దేశాల వైఖరి కూడా పూర్తిగా మారుతుంది. అలాగే రష్యా కూడా కోలుకోవడానికి చాలాకాలం పట్టవచ్చు.

## కందికొండ మృతిపై సిఎం కెసిఆర్ దిగ్భ్రాంతి



### కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి

**హైదరాబాద్, మార్చి 12 (అక్షర వెలుగు):** ప్రముఖ కవి, గేయ రచయిత కందికొండ యాదగిరి మరణం పట్ల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గత కొద్దికాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న కందికొండ మృతికి సీఎం కేసీఆర్ సంతాపం తెలిపారు. తెలంగాణ సబ్బండ వర్గాల సంస్కృతిని తన పాట ద్వారా అజరామరంగా నిలిపిన, వరంగల్ బిడ్డ కందికొండ మరణం, తెలంగాణ సాహిత్య లోకానికి సబ్బండ వర్గాలకు తీరని లోటని సీఎం అన్నారు. పాటల రచయితగా తెలుగు సినీ సాహిత్య రంగంలో తనదైన ముద్రను సృష్టించిన తెలంగాణ బిడ్డ కందికొండ అని సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. కందికొండను కాపాడు కునేందుకు ప్రభుత్వం పలు ప్రయత్నాలు చేసినా ఫలించకపోవడం దురదృష్టమని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సీఎం కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## కార్యకర్త కు అండగా మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**గండీడ్, మార్చి 12 (అక్షర వెలుగు):** బూత్ నెంబర్ 75 ఎన్రోలర్ శ్రీ కొమ్ము అనీల్ కుమార్ గారికి యాక్సిడెంట్ జరిగింది. అనీల్ కుమార్ కు చాలా తీవ్రమైన గాయాలు కావడం తో పరిగి మాజీ శాసనసభ్యులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు టీ.రామ్మోహన్ రెడ్డి తెలియచేయగా వెంటనే హాస్పిటల్లో చేర్పించుకొని దగ్గరుండి నిపుణులైన వైద్యులచే సర్జరీ చేయించారు. విద్యా వైద్యం ఉపాధి ధ్యేయం అనే మాటను నిజం చేసి పేదలకు సహాయం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభినందిస్తున్నారు.

## సహకార సంఘ ఉద్యోగి ఆత్మహత్య

**మహబూబాబాద్, మార్చి 12 (అక్షర వెలుగు):** జిల్లాలోని కేసముద్రం మండలం ధన్నసరి ప్రాథమిక సహకార సంఘం ఉద్యోగి ఒకరు ఆత్మహత్యకకు పాల్పడ్డాడు. చైర్మన్ వేధింపులు తాళలేక ఉద్యోగి పాక రామచంద్రయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. బ్యాంకుకు సంబంధించిన డబ్బులు వాడుకున్నాడని చైర్మన్ మర్రి రంగారావు వేధింపులకు గురిచేశాడు. రంగారావు వేధింపులు తాళలేక రామచంద్రయ్య పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఉద్యోగ ప్రకటనతో కోచింగ్ సెంటర్లకు డిమాండ్

అప్పుడే ఉద్యోగాల కోసం యువత కుస్తీ ● ఆయా ఖాళీల ఆధారంగా ప్రయత్నాలు

కామారెడ్డి,మార్చి12(ఆర్ఎన్ఎ): జిల్లాలో 16 వేల మంది నిరుద్యోగులు జిల్లాలోని ఆయా ఉపాధి కల్పన కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలోని మూడు డివిజన్‌ల పరిధిలో సుమారు 16 వేల మందికి పైగా నిరుద్యోగులు ఉపాధి కోసం ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగాలకు, ప్రైవేట్ కొలువులకు సుమారు 16 వేల మంది నిరుద్యోగ యువతి, యువకులు ఉపాధి కల్పన శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపడితే వీరిలో చాలా మందికి ఉపాధి దక్కే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్‌లు వేయాలని నిరుద్యోగ యువతి, యువకులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగయువత సర్కారు కొలువుల కోసం ఇప్పటి నుంచే కుస్తీ పడుతున్నారు. గ్రంథాలయాలు నిరుద్యోగ యువతతో నిండిపోతు న్నాయి. మరికొందరు కోచింగ్ సెంటర్ల బాట పడుతున్నారు. ఉపాధి కోసం వేల మంది యువత ఎదురు చూస్తోంది. గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వపరంగా ఎలాంటి ఉద్యోగుల భర్తీ నోటిఫికేషన్ వెలువడక పోవడంతో ఉపాధి కోసం జిల్లాలో వేల మంది యువతి, యువకులు ఎదురుచూస్తున్నారు. బీఈడీ, డీఎడ్ చేసిన అభ్యర్థులకు యేటా రెండు సార్లు టెట్ నిర్వహించాలి. కానీ ఐదు సంవత్సరాల నుంచి అది జరగడం లేదు. దీంతో ఉపాధ్యాయ వృత్తి కోర్సు చేసిన అభ్యర్థులు చాలా మంది ప్రైవేట్ పాఠశాలలో చదువులు చెప్పే అవకాశాన్ని కోల్పోయారు. కరోనా ఎఫెక్ట్‌తో పలు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోయారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ వేదికగా రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రకటన చేయడంతో జిల్లాలో నిరుద్యోగులు అప్పుడే ప్రయత్నాలుముమ్మరం చేశారు. జిల్లాలో శాఖల వారీగా ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్న పోస్టులను సైతం ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో జిల్లాలోని నిరుద్యోగ యువతలో ఆశలు చిగురిస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలో 1,340 ప్రభుత్వ ఉద్యోగాల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇవేకాకుండా మరికొన్ని శాఖల్లోనూ వందల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విద్య, వైద్యశాఖలతో పాటు పోలీసుశాఖలో ఎక్కువగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఉద్యోగాల నియామకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయో పరిమితిని కూడా పెంచుతూ ప్రకటించడంతో నిరుద్యోగుల్లో మరింత ఆశలను రేకెత్తిస్తోంది. .జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో 1,340 పోస్టుల ఖాళీలుజిల్లాలో ఆయా ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వరంగ సంస్థల్లో 1,340 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వంతాజాగా ప్రకటించింది. ఇవే కాకుండా మరికొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విద్యాశాఖలో ఎక్కువగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారుల నివేదికలో తేలింది. సుమారు 840 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఎస్ఏ, ఎస్‌జీటీ పోస్టులు, భాష పండితుల పోస్టులు, పీఈటీలు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు మరో 21 ప్రభుత్వ శాఖల్లో వెయ్యికి పైగా ఉద్యోగ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు పేర్కొంటున్నారు.

## సింగరేణిని ప్రైవేట్ పరం చేసే పరిస్థితి లేదు

### తెలంగాణ సెంటిమెంట్ రెచ్చగొడుతున్నారు: కోమటిరెడ్డి



**హైదరాబాద్, మార్చి 12 (అక్షర వెలుగు):** తెలంగాణ సెంటిమెంట్‌ను వాడుకొని టీఆర్ఎస్ రెండు సార్లు అధికారంలోకి వచ్చిందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. పదేపదే అదే ప్రయోగంతో ప్రజలను మోసం చేయాలని చూస్తోందన్నారు. శనివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ సింగరేణిని ప్రైవేట్ పరం చేస్తున్నారనేది వాస్తవం కాదన్నారు. సింగరేణిని ఏ ప్రభుత్వం కూడా ప్రైవేట్ పరం చేయడం లేదన్నారు. సింగరేణిపై టీఆర్ఎస్ నేతల మాటలు నిజం కాదన్నారు. ఎమ్మెల్యేగా జీవన్ రెడ్డి ఏం మాట్లాడతారో అందరికి తెలుసన్నారు. జీవన్ రెడ్డి స్థాయి- రాజగోపాల్ రెడ్డి స్థాయి ఏంటో ప్రజలను అడుగుదామన్నారు. సీఎం కేసీఆర్ ఆరోగ్యం గురించి తానేమి అనలేదని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఐదు రాష్ట్రాల ఫలితాలు చూసి ముఖ్యమంత్రి షాక్ అయ్యారా? అని మాత్రమే అన్నానన్నారు. ముఖ్యమంత్రి హాస్పిటల్‌కు వెళ్లినట్లు తరువాత చూశానన్నారు. జగదీష్ రెడ్డి సభలో మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ఏంటో నల్గొండ ప్రజలకు తెలుసన్నారు. సమైక్య రాష్ట్రంలోనే కాదు.. ఇప్పుడూ తెలంగాణను.. ఆంధ్ర కాంట్రాక్టర్లే దోచుకుంటున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు.

## అసెంబ్లీలో కాంగ్రేస్,టీఆర్ఎస్ మధ్య వాడీవేడి చర్చ



(మొదటి పేజీ తరువాయి..) తెలిపారు. దీనిపై వెంటనే భట్టి లేచి.. మన ఊరు.. మన బడికి ఇచ్చిన నిధులు ఈజీఎస్ నిధులే కదా..? ఒక దానికి కేటాయించిన నిధులు? ఇంకో దానికి బదిలీ చేశారని ఆరోపించారు. జిల్లా, మండల పరిషత్ లకే డబ్బులు లేకుంటే? వాటి నిధులు పక్క దారి పట్టించుకోవడం ఎందుకు..? అని ప్రశ్నించారు. నేను చెప్పేది ఒకటి..కేటీఆర్ చెప్తుంది ఇంకొకటని, సభను..ప్రజలను కేటీఆర్ తప్పుదోవ పట్టిస్తున్నారు అంటూ భట్టి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ స్కూళ్లపై ప్రభుత్వం దృష్టి పెట్టలేదని ఆయన ఆరోపించారు. అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మన ఊరు-మన బడి బాగా లేదని తాను చెప్పలేదని ఆయన పేర్కొన్నారు. ఆ పథకానికి నిధులు లేవనే తాను చెప్పానన్నారు. సభలో చర్చ నడుస్తుందంటే కారణం తామేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు సహకరిస్తేనే సభ నడుస్తుందని ఆయన పేర్కొన్నారు. బిజెపి సభ్యులను ఏకపక్షంగా పంపడాన్ని ఆయన ప్రస్తావించారు. సభ్యులు లేకుండా ఎలా చర్చిస్తారని అన్నారు. అలాగే తాను డిప్యూటి స్పీకర్‌గా ఉండగా తెలంగాణపై ఎంత గలాటా చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ తాము గలాటా చేసి, బెంచీలు ఎక్కినందువల్లనే తెలంగాణ వచ్చిందన్నారు. ఇప్పుడు అంతా మంచిగా చర్చించు కోవాలన్నదే తమ ఉద్దేశ్యమన్నారు. తిరిగి భట్టి మాట్లాడుతూ పాఠశాలలో చాలా ఖాళీలు ఉన్నాయన్నారు. పాఠశాలలో పనిచేసే వారి స్వీపర్ల జీతాలు ఇంకా 2000 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని ఆయన తెలిపారు. మన ఊరు మన బడి పథకానికి స్టేట్ బడ్జెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.ఏసీడీపీ నిధులను కేటాయించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇన్ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు పాఠశాలలో ఖాళీలు ఉండకుండా చూడాలని ఆయన కోరారు. ప్రభుత్వ స్కూల్ లో టీచర్ లు లేక ఇబ్బంది పడుతున్నారని, స్వీపర్లకు ఇంకా రూ. 2500 జీతమే ఇస్తున్నారని ఆయన అన్నారు. అంతేకాకండా వాళ్ళను రెగ్యులర్ చేయండి? జీతాలు పెంచండని ఆయన డిమాండ్ చేశారు. మన ఊరు..మన బడి కి నిధులు పెట్టి పని చేస్తే బాగుంటుందని, ఎమ్మెల్యే ఫండ్ నుండి కట్ చేసి ఇస్తే? ఏం లాభం అని ఆయన వ్యాఖ్యానించారు. ఇది మంచి పద్ధతి కాదని, నేను చదువుకునే రోజుల్లో కూడా సింగల్ టీచర్ ఉండేదని, ప్రభుత్వ స్కూల్ అంటే అప్పట్లో అందరూ దృష్టి పెట్టే వాళ్ళు అని ఆయన వెల్లడించారు. కానీ ఇప్పుడు ప్రజలు పెద్దగా దృష్టి పెట్టే వాళ్ళు లేరని ఆయన వ్యాఖ్యానించారు. అయితే మంత్రి గంగుల కమలాకర్ లేచి కాంగ్రెస్ మయాంలో కార్యకర్తలు చెప్పిన వారికే నిధులు ఇచ్చారని అన్నారు. అప్పుడు శ్రీధర్ బాబు మంత్రిగా ఉన్నాడని అన్నారు. దీనికి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అప్పట్లో అంతా ఓ పద్ధతి ప్రకారం నిధుల కేటాయింపు ఉండేదన్నారు. శాసనసభ చరిత్రలోనే ఆరేడు రోజుల్లో బడ్జెట్‌ను సమావేశాలను ముగించిన ఘనత టీఆర్ఎస్‌దేనని శ్రీధర్‌బాబు దెప్పి పొడిచారు. దీంతో శ్రీధర్‌బాబు వ్యాఖ్యలపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి స్పందించారు. పద్దులపై కాంగ్రెస్ పాలనలో ఎప్పుడైనా చర్చ జరిపారా అని మంత్రి ఎదురు దాడికి దిగారు. ఎన్ని రోజులైనా చర్చకు తాము సిద్ధమని మంత్రి తెలిపారు. ఇంచార్జ్ మంత్రి సంతకం లేకుండా జిల్లాలో ఏ ఒక్కపని జరగదని కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆరోపించారు. శ్రీధర్‌బాబు వ్యాఖ్యలపై మంత్రి తలసాని స్పందించారు. రాజకీయ సంప్రదాయాలకు పురుడు పోసిందే కాంగ్రెస్ అని తలసాని పేర్కొన్నారు. మంచిని ప్రతిపక్షం అస్సలు ఒప్పుకోవడం లేదని తలసాని అన్నారు.

# ఈ-లోక్ అదాలత్

## తో ఉల్లంఘనదారులకు భారీ రాయితీలు

జిల్లా ఎస్పీ శ్రీ ఎన్ వెంకటేశ్వర్లు...




**నారాయణపేట, మార్చి 12 (అక్షర వెలుగు):** జిల్లా ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు ఈరోజు ఎస్పీ కార్యాలయంలో వాహనదారులు ఈ చలాన్ పెండింగ్ లో ఉన్న చలన్లు 2022 మార్చి 31 వరకు చెల్లించుకో వాలని మెగా డిస్కౌంట్ మేళ, వాహనదారులకు మీ వాహనాలపై ఉన్న పెండింగ్ ఈ - చలాన్ ల పై భారీ డిస్కౌంట్ అనే వాల్ పోస్టర్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలు గత రెండు సంవత్సరాలుగా కోవిడ్ తో ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలతో పోలీసు న్యాయ శాఖ అధికారులను సంప్రదించిన తర్వాత ఈ - లోక్ అదాలత్ ద్వారా ఉల్లంఘనల దారులకు వన్టైమ్ సెటిల్మెంట్ కింద భారీ రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. మార్చి 31 వ తేదీ వరకు ఈ అవకాశం ఉంటుందని తెలిపారు. కావున జిల్లా పరిధిలోని వాహన దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని పెండింగ్ చాలన్లని క్లియర్ చేసుకోవాలని ఎస్పీ సూచించారు. రెండు, మూడు ద్యిచక్రాల వాహనాలకు - 75% ఆర్టీసీ డ్రైవర్ లకు 70%, లైట్ హెవీ మోటర్ వాహనాలకు కు 50%, నో మాస్క్ కేసులకు - 90% డిస్కౌంట్ ఇవ్వడం జరిగింది. వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని పెండింగ్ చాలన్ లను టీఎస్. ఆన్లైన్ లేదా మీసేవ లాంటి ఆన్లైన్ సేవల ద్వారా చెల్లించ వచ్చు అని ఎస్పీ తెలిపారు. అలాగే జిల్లా పోలీస్ స్టేషన్ పరిధిలోనీ పోలీస్ అధికారులకు స్పెషల్ డ్రైవ్ లు, నిర్వహించి ఈ చలాన్ లు పెండింగ్ ఉన్న వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది అని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీకాంత్ రెడ్డి, కృష్ణయ్య , టౌన్ ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు...

# సిసి రోడ్డు పనులు ప్రారంభం



**మందమర్రి, మార్చి 12 (అక్షర వెలుగు):** మందమర్రి మండలంలోని బొక్కల గుట్ట గ్రామంలో ఎన్ఆర్ఈజిసి నిధుల ద్వారా 3 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో గ్రామపంచాయతీ రోడ్డు నుండి పోచమ్మ గుడి వరకు సిసి రోడ్డు పనులు శనివారం ప్రారంభించడం జరిగింది. సిసి రోడ్డు పనుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మండల జడ్పిటిసి వేల్పుల రవి, మండల ఎంపిపి గుర్రం మంగ శ్రీనివాస్ గౌడ్, గ్రామ సర్పంచ్ బొలిశెట్టి సువర్ణ కనకయ్య లు హాజరై, రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల సింగిల్ విండో వైస్ చైర్మన్ మంద విక్రమ్ గౌడ్, ఎంపీటీసీ ధరావత్ తిరుపతి, గ్రామ ఉప సర్పంచ్ సామల శ్రీనివాస్, వార్డు సభ్యులు ముకుందం, మారం తిరుపతి, గ్రామ పెద్దలు మారుపాక రాజయ్య, బలికొండ కిషన్, రవి నాయక్, భారత రాములు, మాసు శ్రీనివాస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఆర్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సు




**మంచిర్యాల, మార్చి 12 (అక్షర వెలుగు):** మంచిర్యాల జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధం అయ్యే విద్యార్థినీ, విద్యార్థుల సౌకర్యార్థం జిల్లాలో గత 4సంవత్సరాలుగా రాష్ట్రస్థాయి శిక్షకులచే శిక్షణ ఇస్తున్న ఏఆర్ అకాడమీ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మార్చి 15న మంచిర్యాల పట్టణంలో ఉచిత అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ భూపెల్లి లక్ష్మణ్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మార్చి 16న ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సన్నద్ధం అయ్యే వారికి ఈవెంట్స్, రన్నింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈవెంట్స్ లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ముందుగా 500 రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి, తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈవెంట్స్ లో పురుషులు 800 మీటర్ల పరుగు పందెం 175 సెకండ్లలో, స్త్రీలు 100 మీటర్ల 18 సెకండ్లలో పరుగు పందెం గెలుపొందిన వారికి ప్రథమ,ద్వితీయ బహుమతులతో పాటు రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9640830018, 8096720018 సెల్ నెంబర్లను అకాడమీ డైరెక్టర్ భూపెల్లి లక్ష్మణ్, అకాడమీ ఇంచార్జ్ సిహెచ్ ప్రత్యూష లను సంప్రదించాలని సూచించారు.

# రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా సదస్సును విజయవంతం చేయండి

**మంచిర్యాల, మార్చి 12 (అక్షర వెలుగు):** మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో మార్చి 13న నిర్వహించు రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా కమిటీ సదస్సును విజయవంతం చేయాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చెన్నూరు పట్టణంలోని హబిబ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించు సదస్సుకు ముఖ్య అతిథులుగా వేదిక రాష్ట్ర కన్వీనర్ మందకృష్ణ మాదిగ, కో కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరాం, బేబీ రాజు, జాజుల శ్రీనివాస్ గౌడ్, బెల్లయ్య నాయక్, అద్దంకి దయాకర్, గోమాస శ్రీనివాస్, ఇందిరా శోభన్, ప్రొఫెసర్ కాసీం, గోపాల్, రాజీ హైదర్, ఛీఫ్ కో ఆర్డినేటర్ తీగల ప్రదీప్ గౌడ్ లు హాజరు అవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, ముస్లిం ,మైనార్టీ నాయకులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై, సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదిక జిల్లా కమిటీ సభ్యులు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ నీలకంఠేశ్వర గౌడ్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్, విహెచ్పిఎస్ జాతీయ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ నాయకులు మంత్రి మల్లేష్ మాదిగ, మాలమహానాడు రాష్ట్ర నాయకులు పలిగిరి కనకరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు తోకల తిరుపతి, బీసీ సంఘం నాయకులు గుమ్ముల శ్రీనివాస్, సోషల్ మీడియా ఇంచార్జ్ గారె చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యుల సహాయక సంఘం 21వ మహాసభ విజయవంతం



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 12 (అక్షర వెలుగు):** తెలంగాణ గ్రామీణ వైద్యుల సహాయక సంఘం 21వ జిల్లా మహాసభలు ఖమ్మం జిల్లాలో నిర్వహించడం జరిగింది. ఈ మహాసభలో భాగంగా పినపాక మండల నూతన అధ్యక్షులు రవి శేఖర్ వర్మ గారికి జిల్లా అధ్యక్షులు బి.వి.ఆర్ గారి ఇచేతుల మీదుగా మండల కమిటీ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు శ్రీరామ్ గారు జమాల్ గారు మరియు మండల ఉపాధ్యక్షులు శివ శంకర్ గారు మండల ప్రధాన కార్యదర్శి కోడం నరసింహారావు , ప్రచార కార్యదర్శి వరికిల్ల శ్రీనివాసరావు సహాయ కార్యదర్శి శ్యామల సతీష్, మండల కమిటీ సభ్యులు జి, వెంకటనారాయణ, బూర వెంకన్న, సిహెచ్ నరసింహారావు , కారుకూరి రాజు గారు జాడి రాంబాబు, మండల సభ్యులు పాల్గొన్నారు.

# గిరిజన పోడు రైతును పరామర్శించిన తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మార్చి 12(అక్షర వెలుగు):** కరకగూడెం మండల కేంద్రంలోని కన్నాయిగూడెం గ్రామంలో సుతారి శ్రావణ్ కుమార్ తండ్రి నరసింహారావు అనే గిరిజన పోడు రైతు తాను సాగు చేసుకుంటున్న అటువంటి పోడు భూములలో యంత్రాలతో ట్రెంచ్ లను తీసి మొక్కలు నాటుతామని ఫారెస్ట్ అధికారులు నోటీసులు చూపించి హెచ్చరించడంతో, తన జీవనాధారమైన అటువంటి పోడు భూమి ఫారెస్ట్ అధికారులు స్వాధీనపరుచుకుంటే తన బతుకు భారంగా మారుతుందని మనస్థాపానికి గురై గురువారం రోజున పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం తాను అనారోగ్య పరిస్థితిలో ఉన్నందున అతనిని పరామర్శించి,తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం తరపున వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని ఇచ్చారు. గిరిజన పోడు రైతులకు తమ సంఘం ఎప్పటికీ అండగా ఉంటుందని, ఫారెస్ట్ అధికారులు గిరిజనులపై చేసే ఈ దౌర్జన్యం ను వెంటనే నిలిపివేయాలని లేని ఎడల పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరిక చేశారు. ఒకవైపు ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇస్తామని దరఖాస్తులు స్వీకరించి ప్రజలకు ఆశ చూపించి మరోవైపు వారు సాగుచేసుకుంటున్నటువంటి పోడు భూములను లాక్కొని ఫారెస్ట్ అధికారులతో మొక్కలు వేసే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పినపాక మండల అధ్యక్షుడు దుబ్బ గోవర్ధన్, పినపాక మండల కార్యదర్శి పూనెం నరసింహారావు, కరకగూడెం మండల అధ్యక్షురాలు తోలెం జ్యోతిక, కరకగూడెం మండలం నాయకులు కొమరం కాంతారావు, పినపాక మండల కమిటీ సభ్యులు మడవి భీమరాజు , జిల్లా కమిటీ సభ్యుడు చర్ప సత్యం,జిల్లా కమిటీ సభ్యుడు మడివి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# వొచ్చే ఎన్నికల్లో పట్నంలో బీజేపీ జండా ఎగరడం కాయం

బన్నె శివమోడి




**ఇబ్రహీంపట్నం, మార్చి 12(అక్షర వెలుగు):** ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ దేశంలో నాలుగు రాష్ట్రాలలో విజయం సాధించడం యాచారం మండల నాయకుడిగా చాలా సంతోషంగా ఉందని యాచారం బీ జే వై ఎమ్ మండల నాయకులు బన్నె శివ మోడీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రియతమ నాయకుడు ప్రధాని నరేంద్ర మోడీ మార్గదర్శకత్వంలో అమీత్ షా , జేపీ నడ్డా నాయకత్వంలో తెలంగాణ బిజెపి అంచెలంచెలుగా అభివృద్ధి పథంలో తీసుకు వెళుతున్న నిరంతర శ్రామికుడు భరతమాత ముద్దుబిడ్డ బండి సంజయ్ కుమార్ కరీంనగర్ ఎంపీ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తిచేసుకుని తెలంగాణలో బిజెపి సర్కారు ఏర్పాటు చేసే దిశగా మూడవ సంవత్సరంలో అడుగు పెడుతున్న శుభ సందర్భంలో హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో కెసిఆర్ నిరంకుశ పాలన అంతమవుతుందని, రాబోయే ఎలక్షన్లలో బిజెపి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కడతారని, మేడిపల్లి ఫార్మాసిటీ విషయంలో ఎంతో పోరాటం చేసిన బిజెపి కార్యకర్తలకు కచ్చితంగా తీపి కబురు అందుతుందని,ఇబ్రహీంపట్నం లో కాషాయ జెండా ఎగర వేస్తామని అన్నారు.

# ఆర్కేపి ఓసిపి అధికారులను అభినందించిన ఏరియా జిఎం చింతల శ్రీనివాస్




**మందమర్రి, మార్చి 12 (అక్షర వెలుగు):** సింగరేణి సంస్థ మందమర్రి లోని జిఎం కార్యాలయంలో శనివారం జాతీయ భద్రత పురస్కారాన్ని అందుకున్న ఏరియా లోని ఆర్కేపి ఓసిపి అధికారులను, ఉద్యోగులను ఏరియా జిఎం చింతల శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి 8న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి భూమేష్ యాదవ్ చేతుల మీదుగా జాతీయ భద్రతా పురస్కారాన్ని ఓసిపి మేనేజర్ వెంకటేశ్వర్లు, టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి రాజ్ కుమార్ లు అందుకోవడం జరిగిందని తెలిపారు. ఇదే విధంగా రక్షణతో కూడా ఉత్పత్తిని సాధిస్తూ, ముందుకుపోవాలని ఆయన అధికారులను, కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం గోపాల్ సింగ్, ఏరియా సేఫ్టీ అధికారి ఓదేలు, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ వరప్రసాద్, అన్ని గనుల మేనేజర్లు, ఏజెంట్లు, సింగరేణి ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గణపురం లో చైన్ స్నాచింగ్ కలకలం



**గణపురం, మార్చి 12 (అక్షర వెలుగు):** మండలం కేంద్రంలోని గుడివాడలో శనివారం సాయంత్రం చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. స్థానికుల వివరాలు ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి ఇంటిముందుకు వచ్చి మీ నాన్న ఉన్నాడా అంటూ ఇంటి ముందు ఆడుకుంటున్న పిల్లలను అడిగాడు. మా అమ్మ ఉందంటూ చెప్పడంతో మీ అమ్మను పిలువు అంటూ అన్నాడు. దీంతో ఆమె బయటికి రాగా.. మెడలోని సుమారు మూడు తులాల మంగళసూత్రాన్ని లాక్కొని పారిపోయాడు. దీంతో ఆందోళనకు గురైన బాధితురాలు కేకలు పెట్టగా. చుట్టుపక్కల వారు వచ్చారు. ఈలోపు చైన్ స్నాచర్ బైక్ పై పరాయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# తెలంగాణలో రాబోయేది బిజెపి డబల్ ఇంజన్ సర్కార్



బిజెపి జిల్లా శాఖ సన్మాన కార్యక్రమం లో బండి సంజయ్ కుమార్

**కరీంనగర్, మార్చి 12 (అక్షర వెలుగు):** బిజెపి ప్రధాని మోడీ నాయకత్వాన్ని దేశ ప్రజానీకం బలంగా కోరుకుంటున్నారని కేంద్రంలో రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వం డబల్ ఇంజన్ సర్కార్ ఉండాలనే ఆకాంక్ష ప్రజల్లో బలంగా ఉందని , ఆ దిశగానే నాలుగు రాష్ట్రాలలోబీజేపీ పై విశ్వాసం ఉంచి ఆదరించి ఉత్తర ప్రదేశ్ , ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ లో ఘన విజయాన్ని అందించారని , తెలంగాణలో రాబోయేది కూడా డబల్ ఇంజన్ సర్కారేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ తెలిపారు . బిజెపి రాష్ట్ర అధ్యక్షులు గా బండి సంజయ్ కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తయిన శుభ సందర్భంలో కరీంనగర్ బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఇట్టి సందర్భంగా బండి సంజయ్ ఉత్తర ప్రదేశ్ లో బిజెపి చరిత్ర తిరగరాసిందని, చరిత్రలో నిలిచే విధంగా దేశంలోనే అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్లో యోగి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రావడం బిజెపి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం ప్రపంచంలోనే భారతదేశాన్ని విశ్వగురువు గా చేయడానికి చేస్తున్న ప్రయత్నాలు , దేశం కోసం , ప్రజల కోసం ఆలోచిస్తున్న విధానాలతో దేశవ్యాప్తంగా బీజేపీ ని ఆదరిస్తున్నారని తెలిపారు .సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ , సబ్ కా ప్రయాస్ నినాదంతో బి.జె.పి ముందుకు వెళుతుందని, బిజెపి ప్రభుత్వం చేసే విధానాలకు దేశ ప్రజలందరికీ సంపూర్ణ మద్దతు ఉందని , అందుకే బిజెపి వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. బీజేపీ పై ఉన్న విశ్వాసానికి దేశంలోని చాలా రాష్ట్రాల్లో డబల్ ఇంజన్ సర్కారులు అధికారంలో ఉండాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని చెప్పారు. అందులో భాగంగానే ప్రస్తుతం జరిగిన ఐదు రాష్ట్రాల్లో నాలుగు రాష్ట్రాల్లో ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా లో బీజేపీ కి స్పష్టమైన తీర్పు ఇచ్చారని, ప్రజలంతా బిజెపి వైపు ఉన్నారనడానికి ఈ ఫలితాలు నిదర్శనం లాంటివని, రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా ఇలాంటి ఫలితాలే వస్తాయ న్నారు. ప్రపంచంలోనే బిజెపికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉందని, దేశంలోని చాలా రాష్ట్రాల్లో అధికారంలో ఉండి, బలమైన శక్తిగా ఉన్న బిజెపి నీ ముఖ్యమంత్రి కేసీఆర్ గద్దె దించుతామనుకోవడం అవివేకమన్నారు.తెలంగాణలో టిఆర్ఎస్ ప్రభుత్వం గద్దె దిగే సమయం ఆసన్నమైందనే విషయం కెసిఆర్ గ్రహించుకోవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో డబల్ ఇంజన్ సర్కారే ఏర్పాటు కాబోతుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు నాయకత్వం అంతా సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరామకృష్ణయ్య, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బత్తుల లక్ష్మీ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, సాయిని మల్లేశం ,మాడ వెంకటరెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి,మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ శంకర్, జిల్లా కార్యదర్శులు బింగి కర్ణాకర్, చేపూరి సత్యం, మాడుగుల ప్రవీణ్, కటకం లోకేష్, జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కళ్యాణ్ జాన పట్ల స్వామి, ముత్యం రావు, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు మర్రి సతీష్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు చొప్పరి జయశ్రీ, కిసాన్ మోర్చా అధ్యక్షుడు అన్నాడి రాజ రెడ్డి, కార్పొరేటర్లు బండి సుమలత, కచ్చు రవి,కసర్ల ఆనంద్, కొల గాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# అదాలత్ ల ద్వారా కేసుల సత్వర పరిష్కారం

జిల్లా జడ్జి ఎం.జీ. ప్రియదర్శిని.





**కరీంనగర్, మార్చి 12 (అక్షర వెలుగు):** లోక్ అదాలత్ ద్వారా కేసులకు సత్వరమే పరిష్కారం లభిస్తుందని జిల్లా జడ్జి ఎంజీ ప్రియదర్శిని అన్నారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ లను అన్ని కోర్టులలో నిర్వహించారు .జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్ కు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్,జిల్లా జడ్జి ఎం జి ప్రియదర్శిని హాజరైనారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కోవిడ్ కారణంగా కోర్టులు సరిగా పని చేయనందున ఎన్నో కేసులు కోర్టులలో పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. లోక్ అదాలత్ లలో కేసుల సత్వర పరిష్కారం వలన కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని అన్నారు. లోక్ అదాలత్ లలో పరిష్కరించ బడిన కేసులకు తిరిగి పై కోర్టుకు అప్పీలు చేసుకునే అవకాశం లేదని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడుతూ లోక్ అదాలత్ వలన కోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య తగ్గిందని, న్యాయవాదులు ముఖ్యంగా సివిల్ కేసులు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పోలీస్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ లోక్ అదాలత్ లలో క్రిమినల్ కేసుల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మొదటి అదనపు జిల్లా జడ్జి భవాని చంద్ర, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి సుజయ్ ,బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జూపల్లి సత్యనారాయణ రావులు తదితరులు లోక్ అదాలత్ ల గూర్చి లు మాట్లాడారు . అనంతరం జిల్లా జడ్జి లోక్ అదాలత్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి లు మాధవి కృష్ణ, వీరయ్య , ఎం.వాణి ,బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అవునూరి అశోక్ కుమార్ ,సబ్ జడ్జి ప్రసాద్, మెజిస్ట్రేట్ లు ,కరీంనగర్ ఏ సి పి తులా శ్రీనివాసరావు,డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వెంకటేశ్వర్లు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజిరెడ్డి లు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, న్యాయవాదులు వివిధ శాఖల అధికారులు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

జనం కోసం - మన అక్షరం
అక్షర వెలుగు
www.aksharavelugu.com
తెలుగు దిన పత్రిక

# చలన చిత్రం

## ఆగస్ట్ 12న ఏజెంట్‌గా వస్తోన్న అఖిల్





మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ తరవాత ప్రస్తుతం అఖిల్ అక్కినేని సురేందర్ రెడ్డి దర్శకత్వంలో 'ఏజెంట్' సినిమాలో నటిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన అఖిల్ ఫోటోలు, ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమా పైన భారీ అంచనాలను నమోదు చేశాయి. తాజాగా ఈ చిత్ర విడుదల తేదిను ప్రకటిస్తూ మేకర్స్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'ఏజెంట్' చిత్రాన్ని ఆగస్టు 12న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. మేకర్స్ విడుదల చేసిన పోస్టర్‌లో అఖిల్ చేతిలో గన్ను పట్టుకొని మాస్ మేకోవర్‌తో స్టైలిష్‌గా ఉన్నాడు. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలకపాత్రలో ఈ చిత్రంలో నటిస్తున్నాడు. సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటిస్తుంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థతో కలసి సురేందర్ రెడ్డి ఈ చిత్రాన్ని స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్నాడు. 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్' సినిమాతో ఫామ్‌లోకి వచ్చిన అఖిల్ ఆ సక్సెస్‌ను కంటిన్యూ చేయాలని భావిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న 'ఏజెంట్' సినిమాలో నటిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం కోసం అఖిల్ తన దేహాన్ని సానపెట్టాడు. ఇదివరకే మేకర్స్ అఖిల్ ఫోటోలను విడుదల చేశారు. 6 ప్యాక్ బాడీతో కండలు తిరిగిన దేహంతో అఖిల్ మాస్ మేకోవర్‌తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైయ్యాడు. ఈ చిత్రం తర్వాత అఖిల్ బాలీవుడ్ నిర్మాత, దర్శకుడు కరణ్ జోహార్‌తో సినిమా చేయనున్నట్లు సమాచారం. ఈ చిత్రం పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కతున్నట్లు టాక్. బాలీవుడ్ దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు టాక్. ఈ చిత్రంలో అఖిల్‌కు జోడిగా జాన్వీ కపూర్‌ను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. దీనిపై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

## ఓవర్సీస్‌లో మంచి టాక్ సొంతం చేసుకున్న రాధేశ్యామ్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, పూజా హెగ్డే జంటగా, రాధాకృష్ణ కుమార్ దర్శకత్వంలో రూపొంది తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన అద్భుతమైన ప్రేమకథ రాధే శ్యామ్. ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. దాదాపు 10 ఏళ్ళ తర్వాత ప్రభాస్ నుంచి వచ్చిన ఈ ప్రేమ కథకు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. ముఖ్యంగా ఓవర్సీస్‌లో రికార్డు ఓపెనింగ్స్ సాధించింది. దీంతో హాలీవుడ్ సినిమాలతో పోటీపడి మరీ అద్భుతమైన వసూళ్లు సాధించింది రాధే శ్యామ్ అని అభిమానులు చెప్పకుంటున్నారు. ఈ నేపథ్యంలో నార్త్ అమెరికాలో మరికొన్ని స్క్రీన్స్ యాడ్ చేశారు. అక్కడ సినిమాకి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. తెలుగులో మంచి ప్రేమ కథ చూసి చాలా రోజులైంది. సౌత్‌లో మరీ ముఖ్యంగా మన తెలుగులో ఇప్పటి వరకు ఇంత భారీ బ్జడెట్‌తో వచ్చిన ప్రేమ కథ మరొకటి లేదు. రాధే శ్యామ్ మాంచి విజువల్ ఫీస్ట్ అని అందరూ చెప్పకోవడం ఆసక్తికరం. ప్రభాస్ లుక్స్, స్టైలింగ్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ. ప్రభాస్, పూజ హెగ్డే మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా వర్కవుట్ అయింది. ఈ సినిమాకు మరో ప్రధానమైన ప్లస్ పాయింట్ విజువల్ ఎఫెక్ట్స్. క్లైమాక్స్ అత్యద్భుతంగా ఉంది. సాధారణంగా ప్రేమ కథల్లో ఈ తరహా క్లైమాక్స్‌ను ఎవరూ ఊహించరు. అదే ఇప్పడు ఈ సినిమాకు బాగా కలిసొచ్చింది. విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో నిర్మాతలు ఖర్చుకు వెనకాడలేదు. జస్టిన్ ప్రభాకరన్ తనపై దర్శక నిర్మాతలు పెట్టిన నమ్మకాన్ని వందకు వంద శాతం ప్రూవ్ చేసుకున్నాడు. అద్భుతమైన పాటలు ఇచ్చాడు. తమన్ బ్యాగ్రౌండ్ స్కోర్ సినిమాకు బ్యాక్ బోన్. కేవలం ఒకే సినిమా అనుభవం ఉన్న దర్శకుడు రాధాకృష్ణ కుమార్.. ఇలాంటి భారీ బ్జడెట్ పాన్ ఇండియా లవ్ స్టోరీని చాలా బాగా హ్యాండిల్ చేశాడు. ఒకవైపు ప్రభాస్ ఇమేజ్ బ్యాలెన్స్ చేసుకుంటూ.. మరోవైపు తాను రాసుకున్న కథకు సరిగ్గా న్యాయం చేశాడు రాధాకృష్ణ. అందమైన కథ.. ఆకట్టుకునే స్క్రీన్ ప్లే.. వినసొంపైన సంగీతం అన్ని కలిపి అద్భుతమైన థియేట్రికల్ ఎక్స్పీరియన్స్ ఇచ్చే లవ్ స్టోరీ రాధే శ్యామ్ అని అభిమానులు, ప్రేక్షకులు అంటున్నారు.

## ఢిల్లీ మహిళా కమిషన్‌ను సందర్శించిన యామీ గౌతమ్

### మహిళల భద్రతపై చైర్‌పర్సన్‌తో చర్చ



బాలీవుడ్ ముద్దుగుమ్మ యామీ గౌతమ్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. బీటౌన్‌లో మంచి గుర్తింపు పొందిన ఈ అమ్మడు తాజాగా నటించిన చిత్రం 'ఏ థర్స్‌డే' మంచి విజయాన్ని సాధించింది. ఇందులో లైంగిక వేధింపులకు గురైనా బాధితురాలి పాత్రలో నటించి ప్రేక్షకులతోపాటు విమిర్శకులను సైతం మెప్పించింది యామీ గౌతమ్. అంతేకాకుండా నిజ జీవితంలో కూడా అత్యాచార వేధింపులకు గురైన మహిళల భద్రత కోసం, వారికి పునరావాసం కల్పించేందుకు మజ్లీస్, పారి పీపుల్ ఎగైనెస్ట్ రేప్ ఇన్ ఇండియా అనే రెండు ఎన్‌జీవో సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ఈ క్రమంలోనే యామీ గౌతమ్ ఢిల్లీ మహిళా కమిషన్ కార్యాలయానికి వెళ్లింది. ఆమెతోపాటు సినిమాలోని తనతోపాటు నటించిన హీరోయిన్ నేహా ధూపియా కూడా ఉంది. వీరిద్దరూ కలిసి ఢిల్లీ మహిళా కమిషన్‌ను సందర్శించారు. కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్‌తోపాటు ఇతర అధికారులతో చర్చించారు. ఢిల్లీలో మహిళల భద్రత, భరోసా కోసం వారు చేపట్టిన వివిధ కార్యాక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా మహిళలపై హింసకు సంబంధించిన ఫిర్యాదులు నమోదు చేసేందుకు ఉన్న 181 హెల్ప్‌లైన్ నంబర్, దాని పనితీరు గురించి వివరంగా తెలుసుకున్నారు. ఈ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు అందిన వెంటనే సత్వర చర్యలు తీసుకునేందుకు పెట్రోల్ వ్యాన్‌లు పంపిస్తారని తెలిసి సంతోషం వ్యక్తం చేశారు. తన సినిమాలో చూపించినట్లు మహిళల భద్రత కోసం చేసిన కఠినమైన చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉందని యామీ తెలిపారు. ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్, ఇతర అధికారులను కలవడం సంతోషంగా ఉందన్నారు. మహిళల భద్రత కోసం ఈ బృందం చూపిన చొరవపట్ల అభినందనలు తెలిపారు. ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో షేర్ చేశారు యామీ గౌతమ్. కాగా యామీ గౌతమ్, నేహా ధూపియా నటించిన 'ఏ థర్స్‌డే' చిత్రం ఫిబ్రవరి 17 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.

## భారీ చిత్రల నిర్మాణపై దానయ్య దృష్టి



మెగా హీరోలతో భారీ చిత్రాలను ప్లాన్ చేస్తున్నారు డీవీవీ దానయ్య. ఆయన నిర్మాణంలో దర్శక ధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఎన్.టి.ఆర్ హీరోలుగా నిర్మించిన పాన్ ఇండియన్ సినిమా ఆర్‌ఆర్‌ఆర్ ఈనెల 25వ తేదీన భారీ స్థాయిలో రిలీజ్ అవుతోంది. ఈ సినిమా తర్వాత వరుసగా సినిమాలను నిర్మిచేందుకు దానయ్య ప్లాన్ చేస్తున్నారట. అదికూడా మెగా హీరోలతో అని టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి, వెంకీ కుడుముల ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. త్వరలో ఈ సినిమాను సెట్స్ మీదకు తీసుకురానున్నారు. ఇక రామ్ చరణ్, ఎన్.టి.ఆర్ హీరోలుగా భారీ మల్టీస్టారర్ ఆర్‌ఆర్‌ఆర్ నిర్మించిన దానయ్య..చరణ్ హీరోగా ప్రశాంత్ డైరెక్టర్‌గా ఓ యాక్షన్ సినిమాను నిర్నించనున్నారు. ఇటీవలే దీనికి సంబంధించిన చర్చలు కూడా జరిగాయి. ఇవి మాత్రమే కాకుండా పవన్ కళ్యాణ్ హీరోగా ఓ సినిమాను నిర్మిస్తారట. దీనిని తేరి చిత్రానికి రీమేక్‌గా రూపొందించనున్నట్టు, త్రివిక్రమ్ డైలాగ్స్- స్క్రీన్ ప్లే అందించనున్నారని సమాచారం. మరి దీనికి సంబంధించిన అఫీషియల్ కన్‌ఫర్మేషన్ ఎప్పుడొస్తుందో చూడాలి. కాగా, ప్రభాస్, మారుతిల కాంబోలో కూడా దానయ్య ఒక సినిమాను త్వరలో ప్రకటించనున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com